

రచన... ధనికొండ హనుమంతరావు...

అనుకున్న పని వొక్కటీ కాలేదు. అందువల్ల నిరాశతో కుంగిపోవటం అలవాటులేని మనిషినే కనక సరిపోయింది. కాని యీ ఊరుకానిఊళ్ళో యీ చలికాలపు రాత్రిని గడపటం ఎలా? యెవరైనా యెరిగిన స్నేహితుడన్నా కనిపిస్తే బాగుండు! యేదోవిధంగా యీరాత్రికి కాలక్షేపం జరుగుతుంది. ఇంత పెద్ద పట్టణంలో యెవరో ఒక స్నేహితుడు నాకు ఉండిఉండొచ్చు; కాని ఎక్కడ ఉంటున్నాడో తెలియదు. కనీసం యే దారిలోనన్నా ఎదురైతే తప్ప ఆస్నేహితుణ్ని గుర్తించే అవకాశం దొరకదు. పోనీ యిప్పటికి ఇంటికి వెళ్ళి మరికొన్నాళ్ళకు వొద్దామనేపని కాదు. నాలుగైదు రోజులైనా సరే ఉండి ఏదోవిధంగా వ్యవహారం పరిష్కారం చేసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

సామాను హోటల్లో పడేశాను. కాలక్షేపం జరిగేమార్గమేమీ కనిపించలేదు. పోనీ కళ్ళుమూసుకొని పడివుంటే నిద్రవొచ్చి కొంతకాలం నాకు తెలియకుండానే జారిపోతుందేమోననే ఆశ లేకపోలేదు—కాని నిద్రఅనేది రావటమూ, పోవటమూ మానవుడి అధీనంలోదిమాత్రం కాదు. అదీకాక ఒకవేళ ఇప్పుడు నిద్రపోతే—నిద్రలేచాక గడపవలసిన కాలం యెక్కువౌతుంది. అందుకని అది లాభం లేదు.

ఊరు కొత్తదైనా — పట్టణమైనా ఇంతకన్నా గొప్ప పట్టణాల్నే చూసిన నాకు దీని ప్రత్యేకత యేమీ కనిపించలేదు. ఇంతకన్నా పెద్ద పట్టణంలోనే నివాసాన్ని ఏర్పర్చుకున్నాక — దీని ఆకర్షణ కూడా నన్నేమీ చలింపనీయలేదు.

ఏమైనా కాలం వెళ్ళబుచ్చటం అనే సమస్యకు గురయ్యాక— యేదోవిధంగా వెళ్ళబుచ్చవలసిందే! తిరిగిన బజారే తిరుగుతూ చాలాసేపు గడిపాను. కాలు కాలిన పిల్లిలాగు—గమ్యస్థాన నిర్ణయం లేకుండా దారి అనేది వుందికదా అని తిరగటంలో ఎంత విసుగు! ఎంత శ్రమ!

వృథాగా ఏమీ గిట్టుబాటుకాని వ్యాపారం సాగిస్తున్నట్టు తోచటం మరీ బాధాకరంగా తోచింది.

కొంతసేపు రైల్వేస్టేషనులో కూర్చున్నాను. వొచ్చేజనమూ, పొయ్యేజనమూ నన్నేమీ ఆకర్షించలేదు: కొత్తదనమనేది కనిపించకపోతే — కనిపించలేదే అనే మరో కొత్త బాధ. కనిపించాక దాన్ని మనం భరించగలమో లేమో అది వేరే విషయం !

ఎంతకూ కాలం గడవకుండా వుంది. ఉన్న సినిమా మంచిదికాదని నాకు తెలుసు. అది కాలాన్ని వెళ్ళబుచ్చలేదని కూడా తెలుసు. అంతకన్నా మరి గత్యంతరంలేదు గనుక సినిమాహాలు వైపే వెళ్లాను.

బైట జనం యెక్కువగా కనిపించలేదు. ఉన్నజనంలో నాలుగోవంతన్నా సినిమా చూసేవాళ్లుగా నాకు తోచలేదు.

జనంలేకుండా కేవలం యే కొద్దిమందికో చూపబడే చిత్రాన్ని భరించటం మరీ దుర్భరం ! జనం తక్కువగా ఉన్నారుకదా అని హాలు నిండి బాగా ఉండేందుకు సినిమావాళ్ళు కొంతమందినన్నా ఊరికనే పంపరు. ఆ అభిలాష వున్న నాలాటివాళ్ళు పరాయి వ్యక్తులకు ఎంతోమందికి టిక్కెట్లు కొనటం అసంభవం ! సినిమాకువెళ్లి కొత్తగాతలకాయనెప్పిని కొనితెచ్చుకోవటమా, మానటమా అనే సమస్య తెగక, హాలుదగ్గరే... తారట్లాడసాగాను.

"ఎప్పుడూ రావటం ?" ఎంతో పరిచయాన్ని సూచించే కంఠస్వరం నావెనకనుంచి వినవొచ్చింది. నన్ను ఐవుండదనే అనుమానం నాకు లేకపోలేదు. ఐనా కూడా ఏదో ఆశ—బహుశా ఎరిగినవాళ్ళెవరన్నా పొరపాటు నన్నా కనిపిస్తే, కొంతకాలం గడుస్తుందేమోనన్న ఆశ, నన్ను పురిగొల్పింది.

మనిషిని ముసలివాడుగానే చెప్పవొచ్చు. ఆయన ముఖకళలో ఎంతో ఆత్రుత, మాధుర్యం, తను పోగొట్టుకొని ఇక దొరకదని నిరాశ చేసుకున్న విలువైన వస్తువేదో అకాత్తుగా కనిపించినప్పుడు కలిగే ఆనందంలాటిదాన్ని నేను గుర్తించాను. నన్నే ఐవుంటుందా అనే అనుమానం నాకిక లేదు; దాదాపు నన్ను నడిబజార్లో కౌగలించుకునేటంత సాహసం, ఆత్రుతను నిరూపిస్తున్నాడు.

బహుశా నేనెవర్నో ఈయనకు తెలిసి ఉండి తీరాలి. నాకు మాత్రం యీయన ముఖం ఎక్కడాచూసిన జ్ఞాపకం రావటంలేదు. బహుశా నా చిన్నతనంలో నన్ను బాగా యెరిగివుంటాడు. నాతండ్రి వయస్సున్న యీ పెద్దమనిషికి మాకుటుంబంతో యెక్కువ పరిచయం వుండివుండొచ్చు. ఆ సంగతి నాకు తెలిసివుండకపోనూవొచ్చు. నిజానికి మా బంధువులందర్నీ నేను యెరగను. ఇలాటి వింత సంఘటనలు నా జీవితంలో అనేకం జరిగినవి. కనుక ఆ అనుభవంతోటే సంభాషణను నడపగలిగే చాకచక్యం నాకు వున్నదని వేరే చెప్పాలా ?

అన్నాను : "వుదయా నేవొచ్చాను."

"ఇంటికన్నా రాలేదే?"

ఈయన యెవరో నాకింకా నిర్ధారణగానన్నా తెలియదు. ఈయన ఇంటి సంగతి నాకెలా తెలుస్తుంది ?

"ఏంలేదు... వేరే పనివుంది..." అని నీళ్లు నమిలాను.

"మనసులో వుండాలికాని, పనులు అడ్డం వొస్తయ్యా?...రా...పోదాం"

నేనేమీ ఘాట్లాడకుండా ఆయన వెన కాలే నడవసాగాను. యీాయన యెవరో తెలుసుకోవటం యెట్లాగా అని ఆలో చిస్తున్నాను.

"అందరూ కులాసా?" అన్నాడు.

"ఆc." అన్నాను, ఆ 'అందరూ' అనే పదంలో యెందరు వున్నారోకూడా ఊహించకుండానే.

సందుల్లోంచి తీసుకువెళ్తున్నాడు— యెక్కడికో? ఇది నాకు పరిచయంలేని పట్టణమని తెలిసినా నాలో భయమేమీ లేదు. యెందుకంటే ఆ పెద్దమనిషి ముఖం చూస్తే ఆయన ఏవిధమైన అపకారాన్ని చేసే చిహ్నాలూ నాకు కనిపించటంలేదు. అసలు ఆయన యెవరో తెలియకుండా ఆయన్నుగూర్చిన ఏనిశ్చితాభిప్రాయాన్ని కలిగి వుండటానికైనా నాకేం హక్కు వుందీ?

అతాత్తుగా ఆయన నడక మందగిం చింది. బహుశా ఆయన చెప్పిన 'ఇల్లు' యీ సమీపంలో వుండొచ్చనే నాఊహ నిజమే ఐంది.

"రండి." అన్నాడు తను ఇంట్లోకి జొరబడుతూ.

మధ్యతరగతి కుటుంబ నివాసాన్ని స్ఫురింపజేసింది ఆఇల్లు; యెంతో శుభ్రం గా హాయిగావుంది. నన్ను సావిట్లో కుర్చీలో కూర్చోబెట్టి ఆయన లోపలికి వెళ్ళాడు. ఐదునిమిషాలు ఏకాంతంగానే గడిపాను. పదేళ్లపిల్ల కాఫీపట్టుకొచ్చింది. ఆ అమ్మాయి కాఫీ నాకు అందిస్తూ నా మొహంలోకి తేరిపార చూచింది—నేను అవునా కాదా అన్నట్టు. వెళ్తూ వెళ్తూ 'బావగారే' అనుకుంది తనలో—నాకు వినిపించేటంత మెల్లిగా!

ముసలాయన వొచ్చాడు. నాపక్కనే కూర్చొని ఎన్నాళ్ళగానో ఇలాటి ఆనంద మయ సంఘటన కోసం ఎదురుచూస్తున్న వాడల్లే ఎంతో తృప్తిలో మునిగిపోయి మాటలు మరిచి పొయ్యాడేమో నని పించింది.

గది గుమ్మంలోంచి రెండు స్త్రీ మొహాలు రహస్యంగా తొంగిచూస్తున్న వి. వాళ్లు నన్ను చూస్తున్నట్టే నేనుమాత్రం వాళ్లను ఎందుకు చూడకూడదు? ఐతే ఇది వాళ్ళఇల్లు; సభ్యతను గమనించా ల్సిన అవసరం, కనీసం నటించాల్సిన బాధ్యత నాకువుంది. కుతూహలం వీటన్ని టినీ తోసిపుచ్చింది... ధైర్యం చేసి చూశాను. ఒక ముసలామె, యీ ముస లాడికి భార్య ఐఉండొచ్చు; ఆమె వెను కనే పద్దెనిమిదేళ్ళ నవజవ్వని—యీ నాలుగు కళ్ళూ నామీదికే కేంద్రీకరించ బడిఉన్నాయి. వీళ్ళెవరిగోలా నాకు పట్ట లేదు. ఆయువతి! ఆమె నన్నా విధంగా చూసినందుకే ఎంతో గర్వంగా, నా గొప్పతనమంతా ఇప్పుడే బైటపడ్డట్టు ఉప్పొంగి పొయ్యాను. కాని వాళ్ళెం దుకు చూస్తున్నారో అర్థంకాదు. ఇందా కటి అమ్మాయి 'బావగారే' అన్న స్వాగ తానికీ, దీనికీ ఏమన్నా సంబంధం వుందే మో? ఇంత ఆశనూ కల్పించుకొన్న నేను నిరాశతో తిరిగి పోవాల్సి రాదుకదా?

"ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తు

న్నాము. ఇలాటిశుభగడియలు జీవితంలో ఉండవేమోననే నిరాశకూడా ఒకప్పుడు కలగకపోలేదు...” అని ముసలాడు నా మొహంలోకి చూశాడు. నన్ను ఉద్దేశించిన మాటలేవీనా, నాకు అర్థం కానందువల్ల పరధ్యానంలో వున్నట్టు తల వూంచేశాను.

“పిల్లా తల్లీకూడా ఏకధారగా ఏడ్చారనుకో. ఏమనుకొని ఏం లాభం? ఎవరి తప్పని విచారించటం కూడా అనవసరమనిపించింది. తప్పు యెవరిదైనా దాని ఫలితం దానికి ఇచ్చుకున్న జరిమానా ఒక పండంటి కాపరం...... ఎలాగో నేనే ఊరడించేవాణ్ని. ఏదో యవ్వనంలో ఉన్నవాళ్ళు, కాస్త ఉద్రేకానికి లొంగిపోయి, యేమౌతుందోననే ఆలోచనన్నా లేకుండానే పట్టుదలలు హెచ్చి ఇలాటి అఘాయిత్యాలు చేస్తారు. కాని సత్యం యెక్కువకాలం దాగదు. ప్రకృతి శాసనాన్ని అనుసరించి వారే కలుసుకుంటారు; కావాల్సిందల్లా కాస్త ఓర్పు. అంతే!......యీనాడు నా మాటలు అక్షరాలా నిజమని నిరూపించబడినవి!”

ఎలా అర్థంచేసుకునేది యీమాటల్ని? ముసలాడు మళ్ళీ సాగించాడు:

“నిజానికి వెధవగోలుసు...... ఏం అది లేకపోతే? సంసారానికి అది అడ్డమా? తన అందాన్ని భర్త తక్కువగా చూస్తాడనే విచారమా? సహజ సౌందర్యవతి ఐన ఇందిరలాటి సుందరికి యీ ఆభరణాలు నిజంగా అనవసరమే కదా? యీమాత్రం ఆలోచన వుంటే అది నీతో పోట్లాడుతుందీ? పోనీ నువ్వు మాత్రం — ఏదో సరదాపడి అడిగింది కదా అని ముచ్చట తీర్చకూడదూ? మరీ తిండికీ గుడ్డకూ మొహంవాచినవాళ్ళు కాదుగా? సంపాయిస్తుంటివి — నీ భార్యను సంతోషపెట్టాల్సిన బాధ్యత నన్నా గుర్తించకుండా యెలా వుండగలిగావు? ఇంత చిన్న విషయం సంసార విచ్ఛిన్నతకు కారణమౌతుందనే ఆలోచన మీ చిన్ని బుర్రల్లో కలిగిఉండదు. అది నిన్ను రెండని, నువ్వుదాన్ని నాలుగంటే ఫలితం -- ? సంవత్సరంనుంచీ యెడమొగం పెడమొగం — ఆ వేడి చల్లారిందా? నాపెళ్ళాం యెక్కడని వెతుక్కుంటూ వొచ్చావు; ఒకరు చెప్పాలా? చెప్పినా ఆ పట్టుదలలో ఇవన్నీ చెవికెక్కుతయా? అంతే— అదికూడా మా ఆయన వొచ్చాడుకదానని సంబరపడింది. ఎన్నాళ్ళ స్నేహమో అన్నట్టు మీరే చిలకా గోరింకలల్లే కాపరం చేసుకుంటారు; దాంతో సరి!”

ముసలాడి లెక్చర్ పూర్తయిందనుకుంటాను. మంచినీళ్ళకోసం ఆజ్ఞాపించాడు.

ఇప్పుడు కాస్తతలకెక్కింది. ఈయన అల్లుడు ఇందిరఅనే ఈయన అమ్మాయితో పోట్లాడటంవల్ల సంవత్సరంనుంచీ పుట్టింట్లోలోనే ఉండిపోయింది. యీ పోట్లాటకు కారణం గొలుసుచేయించమని ఆమె అడగడం, అల్లుడు కాదనటమూను. పోతే ఆ అల్లుడు నాలాగే ఉంటాడు కాబోలు! ఈయన పొరపాటుపడి నన్నే తన అల్లుడుగా భ్రమించాడు. కనుక, వెంటనే ఆయన పొరపాటును చెప్పి ఇక్కణ్నుంచి తప్పుకోవటంఅత్యుత్తమం.

మంచినీళ్ళ గ్లాసుతో ఆయువతి ప్రవేశించింది. నేను అక్కడే ఉన్నట్లు ఇప్పుడే

చూసినట్టు నటిస్తూ, క్షణంసేపు నాముఖం లోకి చూసి, ఎంతో సిగ్గుపడి ఆగ్లాసుతో ముందుకుపోవటమా లేక వెనక్కు తగ్గటమా అని ఆలోచిస్తున్నట్టు తోచింది.

"సిగ్గేమిటే? మీ ఆయనే నే!" అన్నాడు ముసలాడు.

ముసిముసినవ్వుల్తో ముసలాడికి మంచి నీళ్ళగ్లాసు అందించింది. ఇప్పుడు ఇంత దగ్గర్నుంచి చూడటంతో ఆమె సౌందర్యానికి నేను దాదాపు మూర్ఛబోయ్యాను. ఇలాటి అపరూపవతిని ఏకఠిన హృదయుడు యీ కష్టాలపాలుచేసి ఉంటాడు? వాడిది నిజంగా రాతిహృదయమే ఐవుండాలి. పాపం ఎన్నాళ్లనుంచీ తనభర్త కోసం ఎదురుచూస్తూవుందో మెరిసే ఆ కళ్లేసాక్ష్యం ఇస్తున్నవి. రాతిగా మారిన అహల్య శ్రీరామ స్పర్శకోసం పడివుండి శాపవిమోచనం కాగానే ఇలాటిఉద్విగ్న నేత్రాలతోనే చూసి వుంటుంది.

యీక్షణంలో "నేను మీరు అనుకునే వ్యక్తిని కాను" అని చెపితే యీమె క్షణంలో కొయ్యబారవొచ్చు. ఇంత మందీ నన్ను తమఇంటి అల్లుడుగానే నమ్మారు. నా ఒక్కడిమాట ఇక్కడ చెల్లదు. "నేను నేనే!"అని నేను రుజూ చేసుకునేందుకు నా తాతలు దిగిరావాలి. ఇంతేఏడుస్తే నేను సాధించేదేమిటి? యీ బంగారు బొమ్మను అదృష్టవశాత్తూ అనుభవించే అవకాశాన్ని జారవిడిచి, జీవితమంతా యీ అపూర్వసంఘటనను తలుచుకుంటూ ఏడవటం! ఆమెను తిరిగి దుఃఖసముద్రంలోకి తోసెయ్యటం. ఇందులో న్యాయాన్యాయాలవిచక్షణ అనవసరం. ఎందుకంటే ఏ న్యాయంతో ఆమె భర్త ఆమెనువిసర్జించగలిగాడు? అప్పుడు ఏన్యాయం వీరిద్దరినీ కలపగలిగింది? ఆ కుటుంబానికి సౌఖ్యాన్ని కూర్చేదీ, నాకు తృప్తినిచ్చేదీ, ఇతరులెవరికీ హానికానిదీ నేను ఆమెకు ఇవ్వబోయ్యే న్యాయం!

నాపనల్లా అన్నిటికీ మౌనంగాకూర్చోవటమే. మిగతాపనులల్లా వాటంతటవే జరుగుతవి. అనుకున్నట్టే అల్లుడికి జరగాల్సిన మర్యాదల్లో ఏలోటూ లేకుండానే జరిగింది.

* * *

## 2

చచ్చి స్వర్గానికి పోయి పొందదగ్గ సౌఖ్యం ఏదన్నావుంటే—అదంతా నేను ఆరాత్రి ఇందిరను పొందటంలో చవిచూశాను. ఇందిర మాటల్నీ, లాలననూ పట్టి చూస్తే యెంత అమాయకురాలో ననిపించింది. ఏడాదిగా వియోగభారాన్ని వహిస్తున్న ఆమె — యీ పన్నెండు నెలలబాకీ ఒక్కసారిగా వసూలుచెయ్యాలనేటంత ఉద్రేకంతో ఊగిపోయింది. అలాటి యువతిని చేజేతులా వొదులుకున్న ఆ దౌర్భాగ్యుడైన భర్తమీద నాకు నిజంగా జాలివేసింది. కాని ఆ దౌర్భాగ్యుడివల్లనే నాకీమెపొందు లభించిందనే సత్యం నాకు అప్పుడు గుర్తురాలేదు.

ఎంత చిన్న విషయం యీ చిన్నదాన్ని బాధపెట్టింది! నేను యీ వూరొచ్చిన పనికానీ, సామానంతా హోటల్ గదిలో వుందనే జ్ఞాపకంకానీ నాకు లేదు. నన్ను నేనే మరిచిపొయ్యేట్టు చెయ్యగల ఆ యువతిని యెలా మరు

స్తాను? యెన్నాళ్లయినా ఇక్కడే ఉం దామా అనిపించింది.

ఆమె భర్తపట్ల ఎంత ప్రణయస్వరూపిణో నాకు నిర్ధారణగా తెలిసింది. భర్త వలె నటించటంలో ఎంతో ఇబ్బంది వుంటుందనుకున్నాను కాని, ఆమెను ఎంతో తేలిగ్గా మోసపుచ్చగలిగాను. నాకు నేనై ఆమెను భ్రమించటం లేదిక్కడి. ఆమె ఒక గాఢనమ్మకాన్ని తొలిగించలేని నా అశక్తత!

మర్నాటి వుదయం నిద్ర లేచేప్పటికి కాఫీ వుప్మాలు సిద్ధంగావున్నవి. స్వర్గంలో మాత్రం ఇంతకన్న ఎక్కువ వుండేదుస్తుందా? ఆపగలల్లా హాయిగా తగినంత విశ్రాంతి తీసుకున్నాను. బైటికి వెళ్ల బుద్ధికాలేదు. ఇంట్లో బాధపడలేక బైటికి వెళ్ళవలసిన అవసరం ఇంకా కలగలేదు.

ఇలాగే ఐదురోజులు గడచిపోయినవి. కాలంసాగినకొద్దీ నాలోభయం ఎక్కువవ సాగింది. వాళ్ళు వెళ్ళమనరు - అల్లుణ్ని ఎలా వెళ్లమంటారు? కాని యీవ్యవహారం చాలాదూరం వెళ్ళేటుగా వుంది. నేను వెళ్లేప్పుడు ఆమెకూడా నావెంట పడితే? యీమెకు తీసుకువెళ్లి నేనెక్కడ సంసారం పెట్టేది? అసలు బండారమంతా అప్పుడు బైటపడక మానదాయె. దీనికి ఏమిటా వుపాయంఅని ఆలోచిస్తున్నాను.

ఆరాత్రి మెల్లిగా కదలేశాను. "రేపు నేను వెళ్తాను" అన్నాను ఆమెతో.

"ఎక్కడికి! నేనుమాత్రం మిమ్మ విడిచి క్షణంకూడా వుండను. నన్నుకూడా తీసుకు వెళ్లండి".

"నేను వెళ్లి వుత్తరం రాస్తాను. మీ నాన్న తీసుకొచ్చి దిగపెడతాడులే!"

"ఊహుఁ. "ఇదవరకు ఐందిచాలు. నన్ను తీసుకువెళ్లకపోతే చంపుకున్నట్టే!"

ఎంత బతిమాలి చెప్పినా ఇదే వరస. ఆమెను నిద్రపోనిచ్చి ఆలోచించాను. ఏబజారుకనో దూసుకుంటే? కాని -యీ అమాయకురాల్ని ఇంత అనుభవాన్ని నాకిచ్చిన యువతిని ఇలా మోసపుచ్చి తిరిగి బాధపెట్టటంకన్న అమానుషత్వం వుందా? చూస్తూ చూస్తూ ఆపనిచేయలేనేమో ననిపించింది.

ఇంకో వుపాయం ఆలోచించాను. సామాన్యంగా స్త్రీలను నగలతో మభ్య పెట్టవొచ్చు. అందులోనూ ఇన్నాళ్ళుగా ఆమెను బాధపెట్టిన ఆ గొలుసు కనక చేయించి ఇస్తే ఆమెకు ఎంతో తృప్తి కలుగుతుంది. ఆ సంగతి ఎత్తుతే మళ్ళీ ఏ ప్రమాదంవొచ్చి పడుతుందోనని ఆమె తగిన జాగ్రత తీసుకుంది. ఇక నాఅంతట నేనే ఆపని చేస్తే—పిల్లాడికి తినుబండారమేదో ఇచ్చి మాయపుచ్చినట్టు యీమె మనసునుకూడా వేరే తోవలోకి నెట్టి నేను బైటపడదామనే నిశ్చయానికి వొచ్చాను.

మర్నాడు గొలుసు సంగతి ఎత్తేప్పటికి ఆమె బుంగమూతిపెట్టి "పోనీండి. మళ్లీ ఆ సంగతి దేనికి?" అంది.

"అదికాదు...గొలుసు చేయించుకో. ఇదుగో హైకం" ఐదు వందరూపాయిల కాగితాలు ఇచ్చాను. ఇంతేదరా అనే అనుమానం నాకు కలగలేదు. ఆమెముఖం వికసించటంతో నాకు ఎంతో రిలీఫ్ కలిగింది.

"యీ మధ్యాహ్నం బండికి నేను వెళ్తాను. మళ్ళీ ఐదారురోజుల్లో వొచ్చి

నిన్ను తీసుకెళ్తాను. అప్పటికి యీ బోసి మెడలో గొలుసుకూడా వుంటుందిగా!" అన్నాను.

"వెక్కిరించకండి. ఏ మెడైనా మీ సొత్తేగా" అంది. నన్ను వెళ్లనివ్వని ఆమె పట్టుదల సడలటం చూశాక, నాకు యెంతో స్వేచ్ఛ రాబోతోందని సంతోషించాను.

ఆమధ్యాహ్నం బండికని బయలుదేరి, ఆమెను చాలాసేపు ఊరడించి ఎలాగో బైట పడ్డాను.

## 3

స్నేహితుణ్ని వెతికాను. ఆ సాయింత్రం దాకా వాడితోఉండి రాత్రిబండికి వెళ్లిపోదామని నా నిశ్చయం. ఆ ముసలాడు ఎక్కడ యెదురౌతాడోనని భయంగానే వుంది. ఐనా పక్కన వీడొకడు ఉంటాడు కనుక తప్పించుకోగలననే ధైర్యంకూడా లేకపోలేదు.

ఆ సాయింత్రం కాఫీహోటల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నాం. మావాడి స్నేహితులు ఇంకా ఇద్దరు ముగ్గురు ఉన్నారు.

అకాత్తుగా ఒకడు "అడుగో మామయ్య అల్లుణ్ని తీసుకొని వెళ్తున్నాడు!" అన్నాడు.

అటుతిరిగి చూద్దునుకదా — ముసలాడు! 'మామయ్య' అనే పదం వీడికేనా అని నాకు అనుమానం వేసింది.

"ఎవరూ?" అన్నాను.

"ఆ ముసలాడు అఖండుడు! అందమైన కూతురుంది. కొత్తమొహం ఊళ్లో కనిపిస్తే — కాస్త జల్సారాయుడిగా, డబ్బున్న వాడుగా ఉంటే చాలు తన అల్లుడని భ్రమించినట్టు యెత్తువేసి ఇంటికి తీసుకువెళ్తాడు..."

"మనలాటివాళ్లకు ఛాన్సులేదురా. యీ వెధవ ఊళ్లో ఉండటమే మనం చేసిన పాపం."

ముసలాడు కొత్తయువకుడితో మేము కూర్చున్న కాఫీహోటల్‌కే వొచ్చాడు. మా పక్కనేవున్న టేబిల్ ముందు ఇద్దరూ కూర్చొని కాఫీ తాగుతున్నారు. నన్నెక్కడ చూస్తాడోనని భయపడి ఛస్తున్నాను. చూడనేచూశాడు— ఐతేనేం నన్నెప్పుడూ చూడనట్టే, లెక్కచేయనట్టే ఊరుకున్నాడు.

ఇక జీవితంలో ఆవూరు వెళ్లదల్చుకోలేదు సరికదా— ఆ ఊరు పేరువింటే మామయ్య జ్ఞాపకం రాకమానదు!

